సాక్షి

జోగులాంబ గద్వాల

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



నిఘానేత్రం.. కట్టుదిట్టం

చోరీలు, నేరాల నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸



దాసర్‌పల్లిలో భూ ప్రకంపనలు

దాసర్‌పల్లిలో శనివారం మధ్యాహ్నం 1:22 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.7 /20.8

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ, రాత్రివేళ చలి ఉంటుంది.

హద్దు దాటుతున్నారు!

తుంగభద్ర నదిలో ఇసుక దోపిడీ



తుమ్మిళ్ల శివారులో ఇసుకను అక్రమంగా తోడుతున్న మరబోటు

- ఏపీ ప్రభుత్వ అనుమతుల పేరుతో దర్జాగా నదిలోకి
- సరిహద్దు దాటి ఇసుక తోడివేత
- నదిలో నిండా నీరు ఉన్నా.. మరబోట్ల ద్వారా తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రాజోళి: ఏపీలోని ఇసుకాసురులు సరిహద్దు దాటుతున్నారు. అక్కడి ప్రభుత్వ అనుమతుల పేరుతో దర్జాగా తుంగభద్ర నదిలోకి చేరుకొని ఇసుకను కొల్లగొడుతున్నారు. వారి రాష్ట్రంలో అనుమతులు ఉంటే.. అక్కడ ఇసుకను తీసుకోవాల్సింది పోయి.. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోకి చొరబడి ఇసుకను అక్రమంగా తోడుకుంటున్నారు. నదిలో నీరు ఉన్నా కూడా వదలకుండా మరబోట్ల సహాయంతో నదిలోకి వెళ్లి ఇసుకను ఒడ్డుకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనుమతుల పేరుతో..

తుంగభద్ర నది ఇరు రాష్ట్రాల సరిహద్దులో ఉంది. నది అవతల ఏపీలోని కర్నూల్ జిల్లా గ్రామాలు ఉండగా.. తెలంగాణ వైపు గద్వాల జిల్లా గ్రామాలు ఉన్నాయి. తుంగభద్ర నదిపై ఆధారపడి రెండు ప్రాంతాల రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. తుంగభద్ర నది ద్వారానే లక్షల కుటుంబాలకు తాగునీరు అందుతోంది. అలాంటి నదిలో తమకు ఉన్న అనుమతులను అడ్డు పెట్టుకుని



తూర్పు గార్లపాడులోకి వచ్చి ట్రాక్టర్లకు జరిమానా విధిస్తున్న ఏపీ అధికారులు (ఫైల్)

ఇవతలి వైపునకు వచ్చి ఇసుకను తోడుతున్నా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు అంటున్నారు.

జిల్లా ప్రజలకు అన్యాయం..

నదిలో ఉన్న ఇసుకను జిల్లా ప్రజలు వాడుకునేందుకు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. నదీ తీరంలోని గ్రామస్తులు తమ అవసరం కోసం నదిలోకి వెళ్లి ఇసుకను తీసుకువస్తే అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. కానీ అవతలి వైపు నుంచి రాష్ట్ర సరిహద్దు దాటి వచ్చి వందలాది టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నా.. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నదీ తీర గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏపీలోని ఇసుక వ్యాపారుల వ్యవహార తీరుతో నదిలో ఇసుక మొత్తం ఖాళీ అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబ్బుకు రుచి మరిగిన ఇసుకాసురులు నదిలో నీరున్నా కూడా బోట్ల ద్వారా వచ్చి ఇసుకను తోడుకుని వెళ్తున్నారని

రోజు బోట్లతో తీస్తున్నారు..



తుంగభద్ర నదిలో ఇసుకను తీసేందుకు ఏపీ ప్రభుత్వం మరబోట్లను వాడుతుంది. నదిలో నీరున్న సమయంలోనూ వారు బోట్ల ద్వారా వచ్చి తోడుతున్నారు. నది ప్రవహిస్తున్నప్పుడు అక్కడికి వెళ్లి బోట్లను నిలువరించడం కుదరదు. యథేచ్ఛగా ఇసుకను తోడుకుని వెళ్తున్నారు. ఇసుక తరలింపుపై అధికారులు దృష్టిపెట్టాలి.

– శంకర్ నాయుడు, తుమ్మిళ్ల

ఇప్పుడు హద్దులు గుర్తుకు రావడం లేదా?



గతంలో గద్వాల జిల్లాకు చెందిన పలు ట్రాక్టర్లు నదిలో ఇసుక తీస్తే కేసులు చేసి, జరిమానా వేసిన ఏపీ ప్రభుత్వానికి ఇప్పుడు హద్దులు గుర్తుకు రావడం లేదు. జిల్లా పరిధిలోని రాష్ట్ర సరిహద్దు నుంచి ఇసుకను అక్రమంగా తోడుతున్న మరబోట్లు ఇక్కడి అధికారులకు ఎందుకు కనిపించడం లేదు? వారు హద్దులు దాటడంపై జిల్లా అధికారులు స్పందించాలి.

– గజేంద్ర, తుమ్మిళ్ల

నిఘా పెంచుతాం..

సరిహద్దులో ఉన్న తుంగభద్ర నదిలో ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెడతాం. రాష్ట్ర సరిహద్దు దాటి ఇసుకను తోడే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇందుకు క్షేత్రస్థాయిలో నిఘా పెంచుతాం. మరబోట్ల ద్వారా ఇసుక తోడేందుకు వస్తే నదీ తీర గ్రామాల ప్రజలు సమాచారం ఇవ్వాలి.

– శ్రీనివాసరావు, ఆర్డీఓ, గద్వాల

చెబుతున్నారు. కాగా, కర్నూల్ జిల్లాలో ఐదు చోట్ల ఇసుక అనుమతులు ఉండగా.. దాదాపుగా నదీ తీర గ్రామాలు మొత్తం ఇదే దందా చేస్తున్నట్లు సమాచారం. అయితే రాష్ట్ర సరిహద్దు దాటి వస్తున్న ఇసుకాసురులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకుండా పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా


గతంలో రాజోళి మండలం చిన్న ధన్వాడలో ప్రభుత్వ ఇసుక రీచ్ ఉండగా.. నదిలో ఇసుక తీసుకువచ్చేందుకు వెళ్లిన ట్రాక్టర్లను కర్నూల్ జిల్లాలోని గ్రామస్తులు నిలిపేశారు. తమ రాష్ట్ర సరిహద్దులోకి ఎలా వస్తారని ట్రాక్టర్లను ఇవ్వకుండా అక్కడే ఆపేశారు. చర్చల తర్వాత ఖాళీ ట్రాక్టర్లను వెనక్కి పంపించారు. అదే గ్రామం వారు ఇటువైపు ఇసుకను తోడేందుకు రాగా.. గద్వాల జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. హద్దు దాటి ఎలా వస్తారని అడిగితే.. నదిలో హద్దు అంటూ ఏమి ఉంటుందని పేర్కొంటూ.. ఇక్కడి నదీ తీర గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసి ఇసుకను తోడుకుని వెళ్లిపోయారు.

■ రాజోళి మండలం తూర్పు గార్లపాడులో ఉన్న ఇసుక రీచ్ ద్వారా ఇసుకను తీసేందుకు వెళ్తే.. ఏపీ అధికారులు అక్రమంగా తమ హద్దులోకి వచ్చారనే సాకుతో గత జూన్ 21న దాదాపు 50 ట్రాక్టర్లకు రూ. 6వేల చొప్పున జరిమానా విధించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న ఇసుకను తీసేందుకు వెళ్లిన వారికి జరిమానా విధిస్తే ఎలా అని ట్రాక్టర్ల యజమానులు మొత్తుకున్నా వినలేదు. ఆ ఘటనపై గద్వాల జిల్లా అధికారులు కనీసం నోరు మెదపలేదు. ప్రస్తుతం హద్దులు దాటి మరబోట్లతో ఇసుకను తోడుతున్నా ఇక్కడి అధికారులకు పట్టడం లేదు. ఇసుక అక్రమ రవాణాపై నదీ తీర గ్రామాల ప్రజలు సమాచారం ఇస్తున్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరబోట్లతో ఇసుకను తీయడం వల్ల నదిలో గుంతలు ఏర్పడి, కొన్ని గ్రామాల్లో నది ఎండిపోయి తాగునీటికి కూడా ఇబ్బందిగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల చెంతకు పాలన

గతమంతా నిర్బంధం, అరాచక పాలన

- ఏడాది కాలంలోనే ఎంతో మార్పు
- ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం
- సీఎం సొంత జిల్లాపై ప్రత్యేక దృష్టి
- పర్యాటకంగా అన్ని హంగులు కల్పిస్తాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, నాగర్‌కర్నూల్: 'ఉమ్మడి పాలమూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను అభివృద్ధి చేయాలనే పట్టుదలతో మా ప్రభుత్వం ఉంది. ఉమ్మడి పాలమూరు అభివృద్ధి కోసం తపన పడుతున్నాం. ఏడాది కాలంలోనే స్పష్టమైన మార్పు ప్రజల ముందు కన్పిస్తోంది. ఇప్పటికే నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి, నిర్మాణ పనులను ముమ్మరం చేశాం. మిగితా పెండింగ్ ప్రాజెక్టుల పనులను పూర్తిచేసి రైతులకు నీరందించే లక్ష్యంతో మా ప్రభుత్వం పని చేస్తోంది. ఉమ్మడి జిల్లాను పర్యాటకంగానూ అభివృద్ధి చేసి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దబోతున్నాం.' అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకం, పురావస్తు శాఖల మంత్రి, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు అన్నారు. తమ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 'సాక్షి'తో పలు విషయాలను పంచుకున్నారు.

మార్పు స్పష్టంగా కన్పిస్తోంది..

గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాస్వామ్యాన్ని జాడ లేకుండా చేశారు. ప్రగతి భవన్, సెక్రటేరియట్, ధర్నా చౌక్ వంటి చోట్లకు ప్రతిపక్ష నాయకులు, ప్రజలకు ప్రవేశం లేకుండా చేశారు. ఒక సందర్భంలో నన్ను కూడా ప్రగతిభవన్ గేటు ముందు నుంచే వాపస్ పంపిన సమయంలో చాలా బాధపడ్డాను. మా ప్రభుత్వం వచ్చాక పూర్తిగా పరిస్థితి మారింది. ప్రజలు స్వేచ్ఛగా తిరిగే, మాట్లాడే పరిస్థితి ఉంది. ఏడాది కాలంలోనే ఈ మార్పు స్పష్టంగా కన్పిస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చారు. పదేళ్ల కిందట మేం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగిస్తే.. పదేళ్ల కాలంలో రూ.8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారు. ప్రస్తుతం నెలకు రూ.6 వేల కోట్ల వరకు అప్పు కింద వడ్డీ చెల్లింపులకే సరిపోతోంది.

ఏడాదిలోనే ఎంతో చేశాం..

గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేది. మేం ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నాం. ఏడాది పూర్తికాక ముందే రూ.21 వేల కోట్ల మేరకు రైతులకు రుణమాఫీ చేసి చూపించాం. ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం, పంటలకు బీమా సౌకర్యం కల్పించాం. ఇప్పటి వరకు 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నిరుద్యోగులకు అందించాం. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించాం. ఈ పనులు మా హయాంలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద విస్తరణ పనులను పూర్తి చేస్తాం. ఈ పథకం కింద పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేశాం. పాలమూరు–రంగారెడ్డి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, అచ్చంపేట లిఫ్టు పనులను పూర్తి చేస్తాం. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గురుకుల పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లు ఏర్పాటు కానున్నాయి. ఇందుకోసం ఇప్పటికే రూ.200 కోట్ల నిధులు మంజూరు చేశాం. ఐటీఐ కేంద్రాలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లుగా అప్‌గ్రేడ్ చేసి యువతకు ఉపాధి కల్పించే విధంగా తీర్చిదిద్దబోతున్నాం.

పాలమూరును అభివృద్ధిలో ముందుంచుతాం..

ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం తపిస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాపై ప్రత్యేక దృష్టి ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని అన్ని కులాల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.150 కోట్లను మంజూరు చేశాం. ఉమ్మడి జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దబోతున్నాం. నల్లమల అటవీ ప్రాంతం, సోమశిల టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. రివర్, రిజర్వాయర్ల పరిధిలో వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ సౌకర్యాలను కల్పించబోతున్నాం. ఇప్పటికే సోమశిల ప్రాంతానికి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు నల్లమలలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాలోని పిల్లలమర్రి, మయూరి పార్కు, ప్రముఖ దేవాలయాలు, ఇతర దర్శనీయ ప్రదేశాలను మరింత అభివృద్ధి చేస్తాం.

న్యూస్‌రీల్

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



అయిజ: ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ డివిజినల్ ఆఫీసర్ మహేష్ రైతులకు సూచించారు. శనివారం ఉప్పల శివారులోని రైతు సత్యనారాయణ పొలంలో ఆయిల్‌పాం తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ మేరకు రైతులు కొత్త పంటలు పండించి, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. ఆయిల్‌పాం సాగుచేసిన రైతులకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం సాగుచేసిన నాలుగేళ్ల నుంచి కాపు వస్తుందని.. ఎకరాకు సుమారు రూ. 50 వేల ఆదాయం వస్తుందని వివరించారు. ఇది దీర్ఘకాలిక పంటగా అధిక లాభాలు చేకూరుస్తుందని తెలిపారు. వివరాలకు 82977 68159 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ యుగేందర్, రైతులు సత్యనారాయణ, మునిస్వామి పాల్గొన్నారు.

రేపు హుండీ లెక్కింపు

అలంపూర్: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లోని హుండీలను సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు హుండీలను తెరిచి లెక్కింపు చేయనున్నట్లు పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో భక్తులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

ప్రజల కోసం చేసిందేమీ లేదు



గద్వాలటౌన్: ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం చేసిందేమీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీకే బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళకు రూ. 2,500, స్కూటీలు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా తులం బంగారం అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని ప్రకటించిన ఎమ్మెల్యే... ఏడాదిలో గద్వాల కోసం ప్రత్యేకంగా ఏ అభివృద్ధి సాధించారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధుల మంజూరే లేదని విమర్శించారు. ఇక్కడున్న అధ్వానపు రహదారులు మరెక్కడా లేవని ధ్వజమెత్తారు. ప్రజలను మభ్యపెట్టడానికే ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరల్లోనే ఉన్నాయని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు రామాంజనేయులు, రవికుమార్, బండల వెంకట్రాములు, దేవదాసు, నర్సింహ, చిత్తారి కిరణ్, అనిల్, కృష్ణ, పాండు ఉన్నారు.

కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి



శాంతినగర్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గ్రామపంచాయతీ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. శనివారం వడ్డేపల్లి పురపాలికలోని శాంతినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 700 మంది కార్మికులు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని.. నిరుపేదలైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అంతేగాక ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించని పక్షంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో తిమ్మప్ప, మద్దిలేటి, దేవన్న, ప్రభుదాస్, సోమన్న, గిడ్డయ్య, జైపాల్ ఉన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు

- అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తీర్మానం

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

వివరాలు 9లో ▸

నిరుద్యోగ యువతకు చేయూత



దిశ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

గద్వాల అర్బన్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి నిమిత్తం అవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఎంపీ మల్లు రవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన దిశ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు రుణాల కోసం చేసుకున్న నిరుద్యోగులకు సకాలంలో మంజూరు చేయాలన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. ఆర్థిక సంవత్సరం గడువు సమీపిస్తున్నందున లక్ష్య సాధనలో వెనకబడిన బ్యాంకర్లు రుణాల మంజూరులో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అర్హులైన నిరుద్యోగ యువతకు యూనిట్లను మంజూరు చేసి ప్రోత్సహించాలని సూచించారు. ఇప్పటి వరకు మంజూరైన యూనిట్లు, పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21న వనపర్తి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో యువతకు వృత్తి నైపుణ్యం, జాబ్‌మేళాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు యుద్ధప్రాతిపదికన రుణాలను మంజూరు చేయాలన్నారు. అనతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్లు నర్సింగ్‌రావు, లక్ష్మీనారాయణ, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

మల్దకల్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనిస్తూ భగవంతుడిని ఆరాధించాలని బెంగళూరు పీఠాధిపతి విద్యాసింధు మాధవ తీర్థస్వామి అన్నారు. శనివారం ఆదిశిలా క్షేత్రంలో పీఠాధిపతి సంస్థాన పూజలు నిర్వహించారు. అంతకు ముందు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి పీఠాధిపతి మాట్లాడుతూ.. సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని.. సమాజంలో ఉన్న కులమతాలతో పాటు ప్రజల మధ్య ఉన్న అసమానతలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ దైవభక్తిని కలిగి ఉంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం వల్ల జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకునే వీలుంటుందన్నారు. అనంతరం పీఠాధిపతిని భక్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, నాగరాజు శర్మ, అరవిందరావు, బాబురావు, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో సంస్థాన పూజలు చేస్తున్న పీఠాధిపతి విద్యాసింధు మాధవ తీర్థస్వామి

ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన



గద్వాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతోందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని శనివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జములమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి.. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంట బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రధాన చౌరస్తాల్లో బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే చేసి చూపించిందన్నారు. రాష్ట్రంలో రైతురాజ్యం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని, సీఎంని దూషిస్తే ఊరుకునేది లేదన్నారు. అనంతరం తిరుమలేష్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులను ఘనంగా సన్మానించారు. వారికి ఎంపీ మల్లురవి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుకన్య, ఏసన్న, శ్రీకాంత్, ధరూర్ రవి, అజయ్, లక్ష్మణ్, రహీంబాబ్రే, వంశీకుమార్, గణేష్, రాజేష్, వినయ్, మధు, శేఖర్, పురుషోత్తం, మహేష్, ప్రకాష్, సమీర్ పాల్గొన్నారు.

ఘనంగా బాలోత్సవం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అతిథులు

అలంపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించాయి. కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయ రాజు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకం అంజన్న, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య హాజరయ్యారు. బాలోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల సంప్రదాయ కళలు, కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఆట–పాట ప్రతి ఒక్కరినీ ఉత్తేజపరుస్తుందన్నారు. సాహిత్యం, కళలు సమాజ చైతన్యానికి దోహదపడతాయని అన్నారు. సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంచుతాయన్నారు. విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, వికాసం, సమయపాలన అందించడం వల్ల సమాజంపై గౌరవం పెరుగుతుందన్నారు. మూఢనమ్మకాలను వీడి, సైన్స్‌ను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్ కుమార్, జీహెచ్‌ఎం బాలాజీ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణరెడ్డి, ధర్మరాజు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైలం జలాశయంలోకి 6,887 క్యూసెక్కులు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన నాగార్జునసాగర్ జలాశయం నుంచి 6,887 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 2.965 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. శనివారం సాయంత్రం వరకు జలాశయంలో 863.9 అడుగుల వద్ద 118.6216 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నల్లవెల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన సాయి (30) మండలంలోని నల్లవెల్లికి చెందిన ఓ రైతు వద్ద కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు శనివారం గేదెలకు నీటిని తాగించేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. గుర్తించిన స్థానికులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..


అనిత (ఫైల్)

అయిజ: కుటుంబ కలహాలతో క్షణికావేశానికి లోనై ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. తహసీల్దార్ జ్యోతి తెలిపిన వివరాలు.. మండలంలోని ఉప్పలకి చెందిన అనిత(22)కు సంకాపురం గ్రామానికి చెందిన కుర్వ భీమరాయుడికి గతేడాది వివాహమైంది. కొన్నినెలల నుంచి కుటుంబసభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భావోద్వేగాలకు గురైన అనిత శుక్రవారం రాత్రి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మరణించింది. మృతదేహానికి ప్రభుత్వ ఆస్పత్రిలోనే పోస్ట్‌మార్టం నిర్వహించారు. తహసీల్దార్ పంచనామా చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతిరాలుకి భర్త, ఆరు నెలల కుమారుడు ఉన్నారు.


నిఘా నేత్రం.. కట్టుదిట్టం

ఇంట్రోనెట్ టెక్నాలజీతో సీసీ కెమెరాల ఏర్పాటు

- బాదేపల్లి పెద్దగుట్టపై భారీ సామర్థ్యంతో డివైస్ ఏర్పాటు
- 35 కి.మీ. దూరంలోని సీసీ కెమెరాల సిగ్నల్స్ క్యాచ్
- గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏర్పాటుకు పోలీసుల చర్యలు

కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ నుంచి జడ్చర్లకు ఆర్టీసీ బస్సులో వస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగు నుంచి దాదాపు రూ. 36లక్షలు అపహరించారు. చోరీకి పాల్పడిన దొంగలు జడ్చర్లలో దిగి వారి వారి ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సీసీ కెమెరాలు ప్రధాన ఆధారంగా మారాయి. వెంటనే దొంగలను పట్టుకొని సొమ్మును రికవరీ చేశారు. అదే విధంగా జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలి నుంచి నగలు అపహరించిన దొంగలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. జడ్చర్లలోని ఐటీసీ గోదాము నుంచి రూ. 36 లక్షల విలువ గల సిగరెట్ కాటన్లను చోరీ చేసిన దొంగలను సీసీ ఫుటేజీల ఆధారంగా దొరకబుచ్చుకున్నారు. ఇలా చోరీలు తదితర నేరాల దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలకం అవుతున్నాయి.


బాదేపల్లి పెద్ద గుట్టపై డివైస్‌ను పరిశీలిస్తున్న సీఐ ఆదిరెడ్డి


బాదేపల్లి పెద్ద గుట్టపై ఏర్పాటుచేసిన డివైస్

జడ్చర్ల: చోరీలు ఇతర నేరాల నియంత్రణకు పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. అందులో భాగంగా జడ్చర్ల పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో ఇంట్రోనెట్ టెక్నాలజీతో వైర్‌లెస్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌లోని డివైస్‌తో అనుసంధానిస్తున్నారు. గతంలో సీసీ కెమెరాలను కేబుల్‌తో డివైస్‌కు అనసంధానం చేసే పరిస్థితి ఉండేది. అయితే ప్రధాన రహదారులు, కూడళ్లు, కాలనీల్లోని సీసీ కెమెరాల నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న వైర్లు తెగిపోవడం, తెంపడం తదితర కారణాలతో ఆయా దృశ్యాలు రికార్డు కాలేని పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో నేరాలకు పాల్పడే వారిని గుర్తించడం కష్టతరం అవుతుందని భావించిన పోలీసు అధికారులు.. ఇంట్రోనెట్ టెక్నాలజీతో వైర్‌లెస్ విధానంలో సీసీ కెమెరాలను పోలీస్ స్టేషన్‌లోని డివైస్‌తో అనుసంధానం చేస్తున్నారు. అంతేగాక దాదాపు వంద మీటర్ల ఎత్తున ఉన్న బాదేపల్లి పెద్దగుట్టపై భారీ డివైస్‌ను ఏర్పాటు చేశారు. ఈ డివైస్ దాదాపు 35 కి.మీ. దూరంలోని సీసీ కెమెరాల సిగ్నల్స్‌ను క్యాచ్ చేసి, ఆయా రికార్డులను పోలీస్‌స్టేషన్‌లోని డివైస్‌కు నివేదిస్తుంది. తద్వారా పోలీస్ స్టేషన్‌లో గల స్క్రీన్‌పై ఆయా దృశ్యాలను వీక్షించే అవకాశం లభించింది. అయితే చుట్టుపక్కల గ్రామాల పరిధిలో కూడా ఇంట్రోనెట్ టెక్నాలజీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఏమైనా ఘటనలు చోటు చేసుకుంటే.. అక్కడి సీసీ కెమెరాల సిగ్నల్స్‌ను పెద్దగుట్టపై ఏర్పాటు చేసిన డివైస్ క్యాచ్ చేసి, పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన డివైస్‌కు పంపుతుందని చెబుతున్నారు.

గ్రామాల్లోనూ ఏర్పాటు..

జడ్చర్ల చుట్టూ ఉన్న గంగాపూర్, గోప్లాపూర్, నసరుల్లాబాద్ తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిని పెద్ద గుట్టపై ఏర్పాటుచేసిన డివైస్‌తో అనుసంధానం చేశారు. దీంతో అక్కడి దృశ్యాలను పోలీస్‌స్టేషన్‌లోని తెరపై చూడవచ్చు. ఇదే మాదిరిగా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ఆయా గ్రామాల్లోని దృశ్యాలను సైతం పెద్ద గుట్టపై ఏర్పాటు చేసిన డివైస్ ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్‌లో వీక్షించే పరిస్థితి ఉంటుంది. అంతేగాక ఇక్కడి డివైస్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయితే ఎస్పీ కార్యాలయంలో సైతం ఇక్కడి ఫుటేజీలను వీక్షించవచ్చని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

నేరాల నియంత్రణ..



ఇంట్రోనెట్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. బాదేపల్లి పెద్దగుట్టపై భారీ సామర్థ్యం కలిగిన డివైస్‌ను ఏర్పాటుచేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశాం. మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సిగ్నల్స్‌ను పెద్ద గుట్టపై గల డివైస్ ద్వారా పోలీస్ స్టేషన్‌లో వీక్షిస్తాం. ఇంటర్నెట్ సిగ్నల్స్ అంతంత మాత్రంగా ఉన్నా.. డివైస్ క్యాచ్ చేస్తుంది. వ్యాపారులు, ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

– ఆదిరెడ్డి, సీఐ, జడ్చర్ల

రూ. 20లక్షల వ్యయంతో..

జడ్చర్ల పట్టణంలో దాదాపు రూ. 20లక్షల వ్యయంతో ఇటీవల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిమ్మబాయిగడ్డ, సిగ్నల్‌గడ్డ, నేతాజీ చౌరస్తా, గాంధీ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాలతో పాటు వెంకటేశ్వర కాలనీ, సాయినగర్ కాలనీ, తాలుకా క్లబ్, పద్మావతి కాలనీ, విజయనగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు తదితర కాలనీల్లో సీసీ కెమెరాలను బిగించారు. మిగతా కాలనీల్లో సైతం ఇంట్రోనెట్ టెక్నాలజీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వెంకటేశ్వర కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్న కాలనీ వాసులు


కేఎల్ఐ కాల్వకు మరమ్మతు చేస్తున్న అధికారులు

కేఎల్ఐ కాల్వకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

వెల్దండ: వెల్దండ శివారులో తెగిన కేఎల్ఐ కాల్వకు శనివారం అధికారులు మరమ్మతు చేపట్టారు. ఈ నెల 2న 'మళ్లీ తెగిన కేఎల్ఐ డీ–82 కాల్వ' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా డీ–82 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు సాగునీరు అందించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. అయితే కాల్వ తరుచుగా మరమ్మతుకు గురవుతుండటంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇటీవల డీ–82 కాల్వ వెల్దండ, భర్కత్‌పల్లి శివారులో కోతకు గురై తెగిపోయింది. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి జేఈ మహేష్ కాల్వ మరమ్మతు పూర్తి చేశారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. రైతులు సాగుచేసిన వేరుశనగ పంటకు నీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు జేఈ చెప్పారు.

కృష్ణాలో తెలంగాణ తల్లి తొలి విగ్రహం

కృష్ణా: కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర సందర్భంగా తెలంగాణలోకి అడుగిడిన ప్రాంతం, రాష్ట్ర సరిహద్దులోని టైరోడ్డులో తెలంగాణ తల్లి మొట్టమొదటి విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అదే తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో పాదయాత్ర తెలంగాణలోకి అడుగిన మొట్టమొదటి ప్రాంతం టైరోడ్డు. కాగా ఈ ప్రాంతంలో రాహుల్‌గాంధీ నిలబడకుండా పాదయాత్ర చౌక్ నుంచి ముందుకు వెళ్లిపోవడంతో టైరోడ్డు ప్రజలు నిరుత్సాహానికి గురైన స్థానికులు.. ఇప్పుడు అదే విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ దేవత విగ్రహంగా గుర్తించడంతో ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


కాంగ్రెస్ నాయకులు 2022లో టైరోడ్డులో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం

మహిళ గొంతుకోసి హత్యకు యత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు


బాధితురాలు అక్కమ్మ

నవాబుపేట: మండలంలోని మైసమ్మ అడవిలో దారుణం చోటు చేసుకుంది. ఆభరణాల కోసం ఓ వ్యక్తి మహిళ గొంతు కోసి హతమార్చేందుకు యత్నించాడు. స్థానికుల వివరాల మేరకు.. నవాబుపేట మండలం పల్లెగడ్డ గ్రామానికి చెందిన అక్కమ్మ శనివారం వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చింది. ఆమె వద్ద ఆభరణాలను గమనించిన కూచూర్ గ్రామవాసి కరుణాకర్‌రెడ్డి.. ఆమెతో మాటలు కలిపి కల్లు తాగించాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై మైసమ్మ అడవిలోకి తీసుకెళ్లాడు. ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను చోరీ చేసే క్రమంలో ప్రతిఘటించడంతో తన వద్దనున్న కత్తితో గొంతుకోసి హతమార్చేందుకు యత్నించాడు. ఈ క్రమంలో ఆమె కేకలు వేయడంతో, సమీపంలోని వారు అక్కడికి చేరుకుని బాధితురాలిని రక్షించారు. అక్కడి నుంచి కరుణాకర్‌రెడ్డి పారిపోతుండగా.. పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కాగా, బాధితురాలి గొంతు కొంత భాగం మాత్రమే తెగిపోవటంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. ఇదిలా ఉంటే, ఈ ఘటనలో నిందితులు ఇద్దరు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఓ వ్యక్తి అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. అయితే నిందితుడు కరుణాకర్‌రెడ్డి గతంలో పలు నేరాలకు పాల్పడినట్లు తెలిసింది. మహిళలను హత్య చేయడం, ఆభరణాలు చోరీ చేయడం లాంటి వాటితో జైలుకు సైతం వెళ్లినట్లు కూచూర్ గ్రామస్తులు వివరించారు. రెండు నెలల క్రితం జైలు నుంచి బయటికి వచ్చిన నిందితుడు తాజాగా మరో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

దాసర్‌పల్లి భూ ప్రకంపనలు


దాసర్‌పల్లి గ్రామం

- ఉలిక్కిపడిన గ్రామస్తులు

చిన్నచింతకుంట: మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలోని దాసర్‌పల్లిలో శనివారం మధ్యాహ్నం 1:22 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది. రెండు, మూడు సెకన్ల పాటు భూ ప్రకంపనలతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కొందరు ఇళ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. ఇళ్లలోని వస్తువులు కింద పడ్డాయి. కొందరు వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ఊపినట్లుగా అనిపించిందని తెలిపారు. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.0గా నమోదైంది. కాగా, భూకంప ప్రకంపనలకు బోరుబావులే కారణమై ఉండొచ్చని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. 2వేల జనాభా కలిగిన గ్రామంలో 200 పైగా బోరుబావులు ఉన్నాయని.. విచ్చలవిడిగా బోరుబావులను తవ్విస్తుండటంతో భూ ప్రకంపనలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

షాక్‌కు గురయ్యా..



కిరాణ దుకాణం నుంచి ఇంటికి వెళ్లేందుకు బైక్ ఎక్కుతుండగా ఒక్కసారిగా కళ్లు తిరిగాయి. ఒంట్లో బాగోలేక ఇలా అనిపిస్తుందోమోనని కాసేపు అక్కడే ఆగి ఇంటికి వెళ్లాను. భూకంపం వచ్చిందని అందరూ చెప్పడంతో షాక్‌కు గురయ్యా.

– విశ్వనాథ్‌రెడ్డి, దాసర్‌పల్లి

వస్తువులన్నీ కిందపడ్డాయి..



మధ్యాహ్న సమయంలో ఆరు బయట కూర్చున్నా. ఒక్కసారిగా భూమి కదిలినట్టి శబ్దాలు వచ్చాయి. ఇంట్లోకి వెళ్లి చూస్తే వంటగదిలోని ప్లేట్లు, గిన్నెలు కిందపడి కనిపించాయి. ఇదేంటని ఆలోచిస్తూ బయటికి రాగా, గ్రామంలో భూకంపం వచ్చిందని అందరూ అంటున్నారు.

– లక్ష్మి, దాసర్‌పల్లి

వేక్ యాప్‌పై కేసు నమోదు

గోపాల్‌పేట: తక్కువ డబ్బులు ఆన్‌లైన్‌లో పెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మించి మోసం చేశారని శనివారం ఫిర్యాదు అందగా కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం .. మండలంలోని ఏదుల గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఆన్‌లైన్ వేక్ యాప్‌లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మించారు. దీంతో మొదట యాప్‌లో కొంత డబ్బు పెట్టగా కొంత అధికంగా వచ్చింది. రెండోసారి మళ్లీ పెట్టగా వచ్చాయి. మూడోసారి తన పేరిట రూ.1.30 లక్షలు, తన భార్య పేరు మీద రూ.1.30 లక్షలు పెట్టగా తిరిగి రాలేదు. వేక్ యాప్‌లో మొత్తం రూ.4.60 లక్షలు పెట్టి మోసపోయానని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. ఆన్‌లైన్‌లో తక్కువ డబ్బులు పెడితే ఎక్కువ వస్తాయని చెప్పడం వంటి విషయాలు నమ్మకూడదన్నారు. ఏదైనా ఆన్‌లైన్‌లో మోసం జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అత్తాకోడలు మధ్య ఆసక్తికర చర్చ

- నవోదయ స్కూల్ మహబూబ్‌నగర్‌లోనే..
- నారాయణపేటకు సైనిక్ స్కూల్ తీసుకొస్తా
- ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి ఎంపీ డీకే అరుణ హామీ

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద శనివారం నిర్వహించిన అమృత్ 2.0 పనుల శంకుస్థాపన కార్యక్రమంలో అత్తా కోడలైన ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిల మధ్య ఆసక్తికర చర్చ సాగింది. మహబూబ్‌నగర్‌కు మంజూరైన నవోదయ స్కూల్‌ను నారాయణపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తన అత్త (డీకే అరుణ)ను కోరగా.. 'పార్లమెంట్ కేంద్రమైన మహబూబ్‌నగర్‌లోనే ఏర్పాటు చేయాలని ఆ జిల్లా కలెక్టర్‌కు చెప్పడం జరిగింది. నవోదయ స్కూల్‌కు కావాల్సిన పదెకరాల ప్రభుత్వ భూమని సైతం గుర్తించాం. ఆ స్కూల్ అక్కడే ఏర్పాటు చేస్తాం' అని ఎంపీ డీకే అరుణ బదులిచ్చారు. అయితే నారాయణపేటకు సైనిక్ స్కూల్ గతంలో మంజూరైందని.. ఆ స్కూల్‌కు భూ కేటాయింపు కూడా జరిగిందని.. అందుకు సంబంధించిన ఫైల్‌ను తమకు నివేదిస్తే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపేటకు సైనిక్ స్కూల్‌ను తీసుకువస్తానని ఎంపీ భరోసా ఇవ్వడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తంచేశారు. అత్తా కోడలు మధ్య జరిగిన సంభాషణను అందరూ ఆసక్తిగా ఆలకించారు.


ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మధ్య సంభాషణ ఇలా..

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి

దేవరకద్ర రూరల్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన శనివారం ఇస్రంపల్లిలో చోటు చేసుకుంది. స్థానిక వివరాల ప్రకారం.. ఇస్రంపల్లికి చెందిన బోయ జహంగీర్(40) ట్రాక్టర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ట్రాక్టర్ సహాయంతో పొలంలో పత్తి కట్టె తీసేందుకు వెళ్లగా.. పొలంలో ఉన్న ఒక గుంత వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో జహంగీర్‌పై ట్రాక్టర్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

అండర్–14 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక


క్రీడాకారుడి బౌలింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని క్రికెట్ మైదానంలో శనివారం ఉమ్మడి జిల్లా అండర్–14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీసీఏ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ త్వరలో హెచ్‌సీఏ అండర్–14 ఇంటర్ స్కూల్ టోర్నీ నిర్వహిస్తామన్నారు. 24 మంది ప్రాబబుల్స్ క్రీడాకారులను ఎంపిక చేశామని, వీరికి మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను తుది జట్టులోకి తీసుకుంటామన్నారు. టోర్నీలో క్రీడాకారులు వ్యక్తిగత ప్రదర్శనను మెరుగు పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు సాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహుళ అంతస్తుల భవనాల సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వైనం
- నోటీసులు ఇచ్చినా స్పందించని యజమానులు
- అనుమతులు రద్దు చేసినా పట్టించుకోని తీరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో రెండు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలను ఎట్టకేలకు మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు శనివారం సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక రాజేంద్రనగర్‌లో ఓ యజమాని కొన్ని నెలల క్రితం మూడంతస్తుల భవనం నిర్మించేందుకు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. అయితే చుట్టూ 2 మీటర్లు వదలకుండానే మొత్తం గోడలతో కలిపి సెల్లార్‌తో పాటు అదనంగా నాలుగో అంతస్తు నిర్మించసాగారు. అలాగే శ్రీనివాసకాలనీలోని మెయిన్ రోడ్డు పక్కన చిక్కుడువాగు బ్రిడ్జి వద్ద మరో వ్యక్తి మూడంతస్తుల భవనం నిర్మిస్తానని అనుమతి తీసుకున్నారు. ఇక్కడ బఫర్ జోన్ ఉండటంతో నీటిపారుదల శాఖ అధికారుల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) కావాలని మున్సిపల్ అధికారులు అడిగారు. అయితే ఇది ఇవ్వకుండానే మొత్తం నాలుగు అంతస్తులు నిర్మించసాగారు. విషయం తెలుసుకున్న వారు పలుసార్లు ఈ రెండు భవన నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదు. దీంతో ఇటీవల ఈ రెండింటికీ అనుమతి రద్దు చేయడమే గాక తాజాగా జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలను సైతం ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసీపీ జ్యోత్స్నాదేవి, టీపీఓ లక్ష్మీపతి, టీపీఎస్‌లు విశాల్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసకాలనీలో మెయిన్ రోడ్డుపై సీజ్ చేసిన బహుళ అంతస్తుల భవనం ఇదే..


రాజేంద్రనగర్‌లో నాలుగు అంతస్తుల భవనాన్ని సీజ్ చేసిన మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారులు

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని మర్లులో దొంగలు విజృంభించారు. ఒకేసారి మూడు ఇళ్లలో వరసగా దొంగతనానికి పాల్పడ్డారు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మర్లు పోచమ్మ ఆలయం సమీపంలో ఉన్న శోభారాణి, జైపాల్ రెడ్డి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఈనెల 6న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి రాగా ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటంతో పాటు ఇంట్లో బీరువాలో ఉన్న మూడున్నర తులాల బంగారం, కొంత నగదు చోరీ అయినట్లు గుర్తించారు. అదే అపార్ట్‌మెంట్‌లో కింద అంతస్తులో అద్దెకు ఉంటున్న రవి ఇంట్లో కూడా దాదాపు రూ.40వేల నగదు, పక్కనే ఉండే అరవింద్ ఇంట్లో తులంన్నర బంగారం, వెండి వస్తువులు, నగదు అపహరించినట్లు బాధితులు వాపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.